# మోజు

విశ్వనాథ పావని శాస్త్రి




**ఎంకి మహా పెంకి. నెమలి కంఠం పీలిరంగు జరీబుటా బెనారస్ పట్టుచీర కొనాలని క్రితం సంక్రాంతి రోజుల్లో అనుకుంది. మళ్ళీ సంక్రాంతి వచ్చేసింది. చీర యింటికి వచ్చేసింది.**

మడత కూడా సరిగ్గా ఊడదీయకుండానే ఆనందంతో మీద కప్పేసుకుని మంచంమీద అలానే పడుకుంది ఎంకి. అంచు అంతా జరీనగిషీ పని పైట అంతా ఉదయ సూర్యుని కిరణాలల్లే రంగు రంగుల "డిజైను." చీర అంతా జరీ బుటా.బుటా బుటాకి మధ్యలో నుంచి. బుటాకి తాకకుండా త్రాచుపాము మెలికలల్లే జరీపోగులు. ఓహ్........

ఆ రోజు ఎప్పటిలాగానే పొలం మీద వున్న నాయుడికి భోజనం తీసుకెళ్దామని గుమ్మంలోకి వచ్చింది ఎంకి. మోకాళ్ళ దాకా కాసె బిగించి కట్టిన మడత నలగని చేనేత గళ్ళకోక; చింత పూల రైక: జడ చుట్ట చుట్టి కనకాంబరాలు. జాజులు తురిమిన కొప్పు: చెవులకు రాళ్ళ దుద్దులు: పుష్యరాగపు ముక్కుపుడక: పావలా బిళ్ళంత బొట్టు: కంటినిండా కాటుక: మెడలో నాల్గు పేటల నల్లపూసలు—ఎంకి అందమే అందం.అలా గుమ్మం లోకి వచ్చిందో. లేదో వ క్కి ం టి పెద్దయ్య గారి మేడ ముందు చిన్నకారాగింది. పెద్దయ్యగారి కోడలు కిన్నెర కొత్తగా కాపురానికి వస్తోంది! నెమలికంఠం పీలిరంగు జరీబుటా బెనారస్ పట్టుచీర కట్టి. వాలుజడలో మల్లెపూలు పెట్టి. జారిపోతున్న పైటను— పొంగిపొరలుతున్న వాగు. విడిపోతున్న మంచుతెరను. తన కెరటాల హస్తాలతో తిరిగి ఎదమీదికి లాక్కుంటోందా అన్నట్లుగా—సర్దుకుని కారు దిగింది.

కిన్నెర బాగా కలిగిన వాళ్ళ యింటి పిల్ల. పెద్ద చదువులు చదివింది. ఊరికి కొత్త కోడలు. పైగా పల్లెటూరులోనే కాపురం ఉంటానని వస్తోంది. దరిమిలా ఊళ్ళోని ఆడవాళ్ళంతా అక్కడే చేరారు. అంతమందిలో ఎంకినే చూస్తూ వెలిగిపోతున్న కళ్ళతో అలాగే నిలబడి పోయింది కిన్నెర. గుడ్లప్పగించి కిన్నెరనే చూస్తూ తనని తాను మరచిపోయింది ఎంకి. ఆ క్షణం నుంచీ ఆచీరమీదే మనసు పోయింది ఎంకికి....

మంచం మీది నుంచి లేచింది ఎంకి. కొప్పు తీసి వాలుజడ వేసింది. మల్లె పూలు తురిమింది. దుద్దులు తీసి కిన్నెరల్లే జూకాలు పెట్టుకుంది. నుదుటిన దోసగింజల్లే తిలకం దిద్దింది. రెండు చేతు లకి రెండు జతల గాజులే ఉంచింది. లోపల పావడా తొడిగి. నెమలి కంఠం చీర కట్టింది. "మ్యాచింగ్" జాకెట్టు వేసుకుంది.

తలొంచుకుని ఒక్కసారి తనను తాను చూసుకుంది. అద్దాల గదిలో వెయ్యి దీపాలు వెలిగించినట్టు. వెయ్యి స్తంభాల మంటపంలో లక్ష గంటలు మోగించినట్టు అయింది ఎంకి మనసు. అబ్బ! ఇలా కాదు. నిలువెల్లా నిలువుటద్దంలో చూసుకోవాలి. తనింట్లో నిలువుటద్దం లేదు. ఏమైనా సరే! ఈసారి నాయుడి చేత అది కూడా కొనిపించాలి. ఈసారికి కిన్నెర వాళ్ళ యింట్లో వుంది కదా! నాయుడు వచ్చేలోగా తనివి తీరా ఈ చీరలో చూసు కోవాలి. కిన్నెర పెనిమిటి గిరి కూడా సాయంత్రానికిగాని పట్నం నుంచి రాడు.

వాకిట్లోకి చూసింది ఎంకి. వీధిలో ఎవరూ లేరు. పొంగిన వాగల్లే ఛెంగున ఈ గుమ్మంలోంచి ఆ గుమ్మంలోకి పరిగెత్తింది. బయటి గదిలో ఎవరూ లేరు. కాసేపు తటపటాయించింది. తనేమో నల్లనిది. పొలం పనులతో మోటుతేలిన మనిషి. తనసీ. ఈ సుకుమారమైన చీరనీ చూసి కిన్నెర నవ్వుతుందేమో! తనె ప్పుడూ యిలాంటి చీరలు కట్టలేదు. అందులోనూ యిలా కట్టలేదు. ఎబ్బెట్టుగా వుందేమో! ఎవరైనా చూస్తే నవ్వుతారుకూడా! తిరిగి వెళ్ళిపోదామా అనుకుంది. ఊహూఁ! పొంగిన వాగు ఆగుతుందా! కిన్నెరవాళ్ళ గదితలుపు దగ్గిరగా వేసివుంటే తోసి లోపలికి తొంగి చూసింది.

అరె! ఆశ్చర్యం! ఎదురుగా నిలువుటద్దంలో ఎంకి! మోకాళ్ళ దాకా కాసెబిగించి కట్టిన మడత నలగని చేనేత గళ్ళకోక! చింత పూల రైక! జడ చుట్టచుట్టి కనకాంబరాలు. జాజులు తురిమిన

కొప్పు! చెవులకు రాళ్ళ దుద్దులు! పుష్యరాగపు ముక్కుపుడక! పావలా బిళ్ళంత బొట్టు! కంటినిండా కాటుక! మెడలో నాల్గు పేటల వల్లపూసలు!

మతిపోయింది ఎంకికి. తనసలు నెమలికంఠం చీర కట్టుకోనే లేదా? కట్టుకున్నాననే భ్రాంతిలో అలానే వచ్చేసిందా? తలొంచుకుని తనని తాను మళ్ళీ చూసుకుంది. నెమలికంఠం చీర తన ఒంటినే వుంది. అర్థంకాలేదు ఎంకికి. మరదేమిటి? అద్దంలో తన గళ్ళచీర!

ఇంతలో ఎంకి మెదడులో ఏదో మెదిలింది. తను అద్దంలో చూసింది తన ముఖం కాదే! కిన్నెర ముఖం. ఔను! సందేహంగా తలెత్తి చూసింది ఎంకి. ఓరగా వున్న తలుపవతల నుంచి నవ్వుతూ యివతలకి వచ్చింది కిన్నెర.

గుడ్లప్పగించి అలానే కిన్నెరని చూస్తూ నిలబడిపోయింది ఎంకి. వెలిగిపోతున్న కళ్ళతో ఎంకిని చూస్తూ తనని తాను మరిచిపోయింది కిన్నెర.

ఎంకి నవ్వింది. కిన్నెర సిగ్గుపడిపోయింది.

కిన్నెర నవ్వింది. ఎంకి సిగ్గుపడిపోయింది.

ఇద్దరూ నవ్వితే నిలువుటద్దం సిగ్గుపడిపోయింది.

ఆ రాత్రి నాయుడూ. గిరీ నవ్విన నవ్వుకి పున్నమ చంద్రుడు తెల్లారేదాకా సిగ్గుపడిపోతూనే వున్నాడు.

# పండుగలకు పెళ్ళి



పసివాడని పరువంతో
వరుసగా వచ్చే పండుగుల పడుచులకు
ఇంటింటా స్వాగతాల పందిళ్ళు వేద్దాం
ద్వారాలకు నవ్వుల పువ్వుల
తోరణాలు కడదాం.

పిల్ల గాలులను పిలుపుల కంపి
చేమంతుల చిన్నారులనూ
ముద్దబంతుల ముత్తైదువులనూ
పేరు పేరునా పిలుద్దాం
పేరంటానికి రమ్మందాం.

మనసులను చందనంగా చేసి చెక్కిళ్ళకలది
మమతలు పారాణిగ మలచి
ప్రతి పాదానికి పూద్దాం
ఆశల ఆణిముత్యాలతో
రంగవల్లికలు తీర్చి
ఎద వాకిళ్ళను పెళ్ళి పీటలుగ తీరుద్దాం.
శుభాకాంక్షల పూ మాలలే పుస్తెలుగా
తలపుల తారలే తలంబ్రాలుగా
పండుగలకు పెళ్ళిళ్ళు చేద్దాం
బ్రతుకు శృంగాటకంలో
ఊరేగింపులు సలుపుదాం.



— మేకా మన్మథరావు